ఎస్‌ఎఫ్‌ఐ ఓ విశ్వవిద్యాలయం

- సంఘం ద్వారా దేశానికి ఎంతో మంది నిష్ణాతులు
- లౌకికతత్వంపై మాట్లాడితే యూనివర్సిటీల నుంచి సస్పెన్షన్
- శ్రమజీవుల పక్షాన నిలిచేది ఎస్‌ఎఫ్‌ఐ
- ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ్
- ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ 5వ రాష్ట్ర మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న నితీష్ నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం పునాదులపై నిర్మితమైన ఎస్‌ఎఫ్‌ఐ.. ఓ విశ్వవిద్యాలయం లాంటిదని ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం హిందుత్వ ఎజెండాతో ముందుకు సాగుతోందని, సెక్యులరిజంపై మాట్లాడినందుకు స్కాలర్స్‌ను యూనివర్సిటీల నుంచి బహిష్కరిస్తోందని చెప్పారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం (సీతారాం ఏచూరి నగర్)లో మూడు రోజులు కొనసాగిన ఎస్‌ఎఫ్‌ఐ 5వ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నితీష్ నారాయణ్ మాట్లాడుతూ.. ఎస్‌ఎఫ్‌ఐ.. విద్యార్థులకు ఎలా జీవించాలో.. ఎలాంటి వర్గ దృక్పథం కలిగి ఉండాలో నేర్పుతూ దేశానికి ఎంతోమంది నిష్ణాతులను ఇచ్చిందని తెలిపారు. జై భీమ్ చిత్ర ఇతివృత్తానికి సంబంధించిన జస్టిస్ చంద్రు ఎస్‌ఎఫ్‌ఐకి చెందిన వారే కావడం గర్వకారణమన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎన్.రామ్.. ఎస్‌ఎఫ్‌ఐ మొట్టమొదటి జాతీయ అధ్యక్షులని తెలిపారు. ఫ్యూడల్, పెట్టుబడిదారీ భావజాలానికి వ్యతిరేకంగా శ్రమజీవుల పక్షాన ఈ సంఘం నిలబడుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినా, విద్యార్థి సమస్యలపై ప్రశ్నించినా విద్యార్థి నేతలపై దేశద్రోహం కేసు నమోదు చేస్తున్నారని తెలిపారు. లౌకికవాదంపై మాట్లాడినందుకు టీఐఎస్ఎస్ రీసెర్చ్ స్కాలర్ రాందాస్‌పై రెండేండ్లు వేటు వేసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ హెచ్‌సీయూ భూములను కాజేస్తున్నారన్నారు. త్యాగధనులు పుట్టిన గడ్డ ఖమ్మంలో మహాసభలు జరుగుతుండటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

విద్యా కాషాయీకరణను వ్యతిరేకించాలి : కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

విద్యారంగాన్ని కాషాయీకరణ చేసే కుట్రలో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. విద్యారంగంలో జ్యోతిష్యం, మూఢ విశ్వాసాలను చొప్పించి పాఠ్యపుస్తకాలను మార్చేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దేశంలో విద్యా, వైద్యం, ఉపాధి సామాన్యులకు అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నేటికీ విద్యాలయాల్లో చాపకింద నీరులా కులవివక్ష కొనసాగుతోందన్నారు. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీ వివక్షతకు గురవుతున్నారన్నారు. అణచివేత, దోపిడీ, వివక్ష ఏ రూపంలో ఉన్నా వాటిని అంతం చేయాలనే సంకల్పంతో విద్యార్థి లోకం పోరాడాలని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక ఉద్యమాలకు విద్యార్థి లోకం బాసటగా నిలవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కోయ చంద్రమోహన్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు పిట్టల రవి, సిఐటియు నాయకులు కల్లూరు మల్లేష్, ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ నాయకులు నాగేశ్వరరావు తదితరులు సౌహార్ద సందేశాలిచ్చారు.

ఆమోదించిన 17 తీర్మానాలు

ఎస్‌ఎఫ్‌ఐ ఐదవ రాష్ట్ర మహాసభ మొత్తం 17 తీర్మానాలను ఆమోదించింది. నూతన జాతీయ విద్యావిధానం-2020 రద్దు చేయాలని, విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేశారు. రాష్ట్రంలో గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచి రెగ్యులర్‌గా ఇవ్వాలని, మైనార్టీ హాస్టల్స్‌ను బలోపేతం చేయాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలన్నారు. సాంకేతిక విద్యకు నిధులు పెంచాలని, ప్రొఫెషనల్ విద్యాసంస్థల్లో అక్రమ ఫీజులు అరికట్టాలని, రాష్ట్రంలో జాతీయ విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. జిల్లాకో ఇంజనీరింగ్ కళాశాల, నియోజకవర్గానికో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని, ప్రయివేట్ యూనివర్సిటీలను వెనక్కి తీసుకోవాలని తెలిపారు. విద్యార్థినులపై లైంగికదాడులు, హత్యలను అరికట్టాలని తీర్మానించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. విద్యాశాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి పీహెచ్‌డీ విద్యార్థికీ ఫెలోషిప్ ఇవ్వాలని, విద్యారంగంలో మత విద్వేషాలు వ్యతిరేకించాలని తీర్మానాలను సభ ఆమోదించింది.


రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తున్న జూలకంటి

రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేసి రైతుల కష్టాలు తీర్చాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

రైల్వే అండర్ పాస్ ఏర్పాటు చేసి రైతుల కష్టాలు తీర్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని ఐలాపురం గ్రామం వద్ద రైల్వే ట్రాక్‌ను ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోరి నెంబర్ 197, స్థంభం నెంబర్ 110వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేసి గిరిజన రైతులను ఆదుకోవాలని కోరారు. ఐలాపురం గ్రామానికి చెందిన రైతులు రైల్వే ట్రాక్ అవతల పొలాలు ఉండటం వల్ల ఇంతకాలం అనేక ఇబ్బందులు పడి రాకపోకలు కొనసాగించినట్టు తెలిపారు. ఇప్పుడు డబుల్ ట్రాక్ ఏర్పాటు చేస్తుండటంతో ఇబ్బందులు పెరిగే అవకాశం ఉందని, వాటిని దాటాలంటే 5 కిలోమీటర్లు దాటి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గిరిజన రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆ ప్రాంతంలో అండర్‌పాస్ లేదా ఎల్‌సీ గేట్ ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని రైల్వేశాఖకు కోరారు. దీని వల్ల రైతులు పండించే పంటకు రవాణా సౌకర్యం కలుగుతుందని, దాంతో పంటలను సమయానికి మార్కెట్‌కు తరలించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి రవినాయక్, సభ్యులు నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి కృష్ణ, పాయకులు రూప్లా, వెంకటేశ్వర్లు, నాగు, కుమారి, హనుమా, శ్రీను రైతులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ఇఎన్‌సి అక్రమాస్తులు రూ.200 కోట్లకు పైనే..!

- హరిరాం ఆయన భార్య అనితపై ఎసిబి కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఒకపక్క కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో వేల కోట్ల రూపాయల అవినీతి చోటు చేసుకున్నదనే ఆరోపణలు, విచారణలు సాగుతున్న తరుణంలో ఇదే ప్రాజెక్టులో ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ)గా ఉన్న భూక్య హరిరాం అక్రమాస్తులు రూ.200 కోట్లకు పైనేనని ఏసీబీ అధికారులు నిర్ధారణకు రావటం సంచలనం రేపింది. హరిరాంతో పాటు ఆయన భార్య ఇరిగేషన్ శాఖలో డిప్యూటీ ఇఎన్‌సి అనితపై సైతం ఆదాయానికి మించి ఆస్తుల కేసును ఎసిబి అధికారులు నమోదు చేయటంతో ఈ ఆరోపణల తీవ్రత మరింత పెరిగింది.ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం చీఫ్ ఈఎన్సీగా పని చేస్తూ హరిరాం అందినకాడికి డబ్బులను దండుకుంటూ భారీ మొత్తంలో అక్రమాస్తులను పోగేశాడని శనివారం ఆయన ఆస్తులపై జరిపిన ఆకస్మిక దాడుల్లో ఎసిబి అధికారులు కనిపెట్టారు. విల్లాలు, వ్యవసాయ భూములు, నగరం నడిబొడ్డులో ఫ్లాట్లు, ఇండ్లు, పొరుగు రాష్ట్రం ఏపీలో సైతం విలువైన వాణిజ్య భూములతో పాటు భారీ మొత్తంలో బ్యాంకులలో కూడబెట్టిన ధనం వివరాలు ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, సంబంధించిన వివరాలతో పాటు పలు భూములకు సంబంధించిన డాక్యుమెంట్లను సైతం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే.అర్ధరాత్రి పొద్దుపోయేంత వరకు సాగిన దాడుల అనంతరం హరిరాంనకు చెందిన ఆస్తుల జాబితా, వాటి విలువను గణించిన అధికారులకు కండ్లు బైర్లు కమ్మాయి. వాటి విలువ రూ.200 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అదే సమయంలో వాటి ప్రస్తుత మార్కెట్ విలువ నాలుగురెట్ల పైనే ఉంటుందని చెప్పారు. హరిరాం భార్య అనిత సైతం అవినీతికి పాల్పడి ఆస్తులను సంపాదించినట్టు ఏసీబీ అధికారులు కేసును నమోదు చేసి, దర్యాప్తును జరుపుతున్నారు.

కృతికకు చికిత్స అందించేందుకు చర్యలు : మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన గౌరి విజయ్ కుమార్ కూతురు కృతికకు అవసరమైన చికిత్స అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రిలో చికిత్స జరుగుతున్న కృతికకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇది వరకే చికిత్సకు అయ్యే ఖర్చు కోసం ప్రభుత్వం ఎల్వోసీ ఇచ్చింది. ఈ మేరకు పాప తండ్రి విజయ్‌కుమార్‌తో, బసవతారకం హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడిన అధికారులు, పాప ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పాపకు చికిత్సను కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ క్యాన్సర్ ఆస్పత్రి ఎంఎన్ జేలో అన్ని రకాల క్యాన్సర్లకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని, ఈ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు అధికారులు సూచించారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన పరికరాలు, వసతులు ఎంఎన్‌జే హాస్పిటల్‌లో ఉన్నాయన్నారు. అవసరమైన పేషెంట్లకు బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఉచితంగా చేపిస్తున్నామని గుర్తు చేశారు.

డీలిమిటేషన్‌పై నోరెత్తని కెసిఆర్

- కాంగ్రెస్‌పైనే నేరుగా అటాక్
- బిజెపిపై మాట్లాడింది 2 నిమిషాలే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సిఎం కె చంద్రశేఖర్‌రావు ఆ పార్టీ రజతోత్సవ సభలో డీలిమిటేషన్‌పై పల్లెత్తు మాట కూడా మాట్లాడకపోవడం చర్చనీయాంశమవుతున్నది. నియోజకవర్గాల విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగబోతుందనే చర్చ నేపథ్యంలో సభలో కెసిఆర్ మాట్లాడుతారని, కేంద్రం తీరును ఎండగడుతారని అందరూ ఊహించారు. కానీ, ఈ విషయంపై ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం. గంటకుపైగా సాగిన ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వంపై ఆయన రెండు నిమిషాలే మాట్లాడారు. అందులోనూ ఆపరేషన్ కగార్ గురించే ఎక్కువ ప్రస్తావించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నేరుగా ఎక్కడ కూడా అటాక్ చేయలేదు. ఏదో నామకే వాస్తుగా '11 ఏండ్లలో 11 రూపాయలివ్వలేదు..సీలేరు గుంజుకున్నరు.. ఏడు మండలాలు లాక్కున్నారు...తల్లిని చంపి బిడ్డను వేరు చేసినట్టు తెలంగాణ ఇచ్చారు..' అనే మాటలకే పరిమితమయ్యారనే వాదన వినిపిస్తున్నది. బిజెపి పాలనలో రాష్ట్రాల హక్కుల హరణ, రాజ్యాంగంపై పెరుగుతున్న దాడి, విద్వేష రాజకీయాల గురించి మాట్లాడలేదు. డీలిమిటేషన్‌పైనా, బిజెపి విధానాలపైనా బీఆర్ఎస్ వైఖరేంటి? అనేదానిపై అధ్యక్షుని హోదాలో బహిరంగ సభలో స్పష్టతనివ్వలేదు. కాళేశ్వరంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక రావడం, మద్యం కేసులో కవిత ఉండటం, ఇతరత్రా కేసులు వేధిస్తున్న నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో విభేదాలెందుకు? అన్న ధోరణిలో బిఆర్ఎస్ అధినేత ఉన్నట్టు కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. 'ఆనాడైనా.. ఈనాడైనా తెలంగాణకు కాంగ్రెస్సే విలన్' అంటూ హస్తం పార్టీనే టార్గెట్ చేశారు. కెసిఆర్ తన ప్రసంగంలో రేవంత్ సర్కార్‌పైనా, కాంగ్రెస్ పార్టీపైనా విమర్శలు ఎక్కుపెట్టారు. దొంగ గాంధీలు వచ్చి హామీలిచ్చారంటూ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. రాహుల్‌గాంధీపై ఈ విమర్శలను పదేపదే బీజేపీ నేతలు చేస్తూ వస్తున్న విషయం విదితమే. వయోభారం రీత్యానో... ఇతరత్రా కారణాల వల్లో గానీ ఆయన స్పీచ్‌లో గతంలో మాదిరిగా తీవ్రత కనిపించలేదు. సభలు అంటే చాలు నోటిమీద లెక్కలు, సామెతలు, ఉదహరణలతో ఇతర పార్టీలను దునుమాడుతూ అనర్గళంగా మాట్లాడే కెసిఆర్ ప్రస్తుత సభలో రాసిచ్చిన స్క్రిప్టు ముందు పెట్టుకుని మాట్లాడటం గమనార్హం.

ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సిఇఒగా జయేశ్ రంజన్

- జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్
- భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న డాక్టర శశాంక్ గోయల్‌ను గుడ్ గవర్నెన్స్ వైఎస్ చైర్మెన్‌గా బదిలీ చేశారు. ఇప్పటి వరకు పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న జయేశ్ రంజన్ ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవోగా నియమితులయ్యారు. పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా స్మితాసభర్వాల్, కార్మికశాఖ ముఖ్య కార్యదర్శిగా దానకిశోర్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్‌ఎండీఏ వెలుపల)గా టీకే శ్రీదేవి, పట్టణాభివద్ధిశాఖ కార్యదర్శి (హెచ్‌ఎండిఎ పరిధి)గా ఇలంబర్తి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్, ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కె.శశాంక, జెన్‌కో సీఎండీగా ఎస్.హరీశ్,రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవోగా నిఖిల, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ,దేవాదాయశాఖ డైరెక్టర్‌గా ఎస్. వెంకటరావు నియమితులయ్యారు.

స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జెఎండిగా ఉన్న పి.కాత్యాయనీ దేవిని సెర్ప్ అడిషనల్ సిఇఒగా బదిలీ చేశారు. పాఠశాల విద్య సంచాలకులుగా ఉన్న ఈ.వీ.నర్సింహారెడ్డిని పరిశ్రమలు, పెట్టుబడుల సెల్ అదనపు సిఇఒగా, టిజిఎంఎస్‌ఐడిసి ఎండిగా ఉన్న భోర్కాడే హేమంత్ సహదేవరావును జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్‌గా, హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్ జి.ఫణీంద్ర రెడ్డిని టీజీఎంఎస్ఐడీసీ ఎండీగా బదిలీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విధులు నిర్వహిస్తున్న పి.కథిరవణ్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఓఎస్‌డిగా ఉన్న కె.విద్యాసాగర్ (నాన్ కేడర్)ను హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బదిలీ చేశారు. ఆర్. ఉపేందర్ రెడ్డి (నాన్ కేడర్) హెచ్‌ఎండీఏ కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

అదనపు బాధ్యతలు

పలువురు ఐఎఎస్ అధికారులు బదిలీ కాగా వారికి అదనపు బాధ్యతలను కూడా అప్పగించారు. డాక్టర్ శశాంక్ గోయల్‌కు ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్‌గా, జయేశ్ రంజన్‌కు ఆర్కియాలజీ డైరెక్టర్‌గా, ఎం.దానకిశోర్‌కు ఉపాధి, శిక్షణ డైరెక్టర్, ఐఎంఎస్ డైరెక్టర్, లేబర్ కమిషనర్ గా, టి.కె.శ్రీదేవికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ (ఓఆర్ఆర్ పరిధి బయట), కె.శశాంకకు మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌గా, ఎస్.హరీశ్‌కు సమాచార, పౌరసంబంధాల స్పెషల్ కమిషనర్‌గా, రెవెన్యూ డిపార్ట్ మెంట్ జాయింట్ సెక్రెటరీ, ఎస్.సంగీత సత్యనారాయణకు ఆరోగ్య హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవోగా, ఎస్.వెంకటరావుకు యాదగిరిగుట్ట దేవాలయం ఈవోగా, ఇ.వి.నర్సింహారెడ్డికి ఎంఆర్ డీసీఎల్ ఎండీగా, కె.విద్యాసాగర్‌కు హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

కారల్ మార్క్స్, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

- దళిత సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జేబీ రాజు
- హక్కుల సాధనకు నిరంతరం పోరాడాలి : ఏపూరి సోమన్న
- కెవిపిఎస్ ఆధ్వర్యానలో ఇబ్రహీంపట్నంలో పూలే, అంబేద్కర్ జన జాతర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కారల్ మార్క్స్, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని దళిత సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు జేబీ రాజు అన్నారు. పోగొట్టుకున్న హక్కును సాధించాలంటే నిరంతర పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో 'పూలే, అంబేద్కర్ జన జాతర' నిర్వహించారు. ముందుగా పట్టణంలో పూలే, అంబేద్కర్ భారీ చిత్రాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జన జాతరలో ప్రజా గాయకులు ఏపూరి సోమన్న, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేబీ రాజు మాట్లాడుతూ.. కారల్ మార్క్స్, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలన్నారు. సామాజిక పోరాటం వర్ధిల్లాలని, అందుకు కెవిపిఎస్ కీలక పాత్ర పోషించాలని తెలిపారు. అన్ని కుల, ప్రజా సంఘాలను కెవిపిఎస్ ఒకే వేదిక మీదకు తెచ్చిందన్నారు. భారతీయ సామాజిక విప్లవాన్ని రగిల్చిన యోధులు పూలే, అంబేద్కర్ అని చెప్పారు. 90 శాతం ప్రజలకు చదువులేని రోజుల్లో పాఠశాలను స్థాపించిన ఘనత పూలేదని అన్నారు. పూలే ఆశయాలతో భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ తెచ్చారని, ఇప్పుడు దాన్ని తొక్కుతుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. భారత రాజ్యాంగం లేకుంటే మను ధర్మ శాస్త్రం కొనసాగేదన్నారు. మన బిడ్డలు ఐఏఎస్, ఐపీఎస్ కొలువులు వచ్చేవా అని అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన చేసే వారినే తరమివేయాలని తెలిపారు. ఏపూరి సోమన్న మాట్లాడుతూ.. మనువాదుల చేతుల్లో దేశం ప్రమాదంలో పడిందన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బహుజనులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పూలే, అంబేద్కర్, మార్క్స్‌ను ప్రేమించే వారు ప్రశ్నించే గొంతుకలు కావాలన్నారు. ఏకం చేయాల్సిన బాధ్యత కేవీపీఎస్‌పై ఉందన్నారు. 400 సీట్లు కాదు, భారత రాజ్యాంగం జోలికి వస్తే 400 అడుగుల పాతాళంలోకి తొక్కుతామని బీజేపీని హెచ్చరించారు. మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడ సామెల్, ప్రకాష్ కారత్, మాజీ జడ్పీటీసీ పగడాల యాదయ్య, వివిధ ప్రజాసంఘాల నాయకులు అరుణ్‌కుమార్, ఆలంపల్లి నర్సింహ, కిషన్, సీహెచ్ జంగయ్య, ఎల్లేష్, ఆనంద్, వీరేష్, బండి సత్తన్న, కందుకూరు జగన్ పాల్గొన్నారు.

తగ్గిన ఎండలు..పలుచోట్ల వర్షాలు

- అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత
- 50కిపైగా ప్రాంతాల్లో కురిసిన వాన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వాతావరణం చల్లబడటంతో ఆదివారం ఎండలు తగ్గుముఖం పట్టాయి. అయితే, ఉక్కపోత మాత్రం అలాగే ఉంది. నిన్నటి వరకూ పగటి పూట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు నమోదైన విషయం విదితమే. ఆదివారం మాత్రం మెదక్ జిల్లా మినహా మిగతా అన్ని జిల్లాల్లో ఆదివారం 40 డిగ్రీలకు లోపే నమోదయ్యాయి. ఒక్క రోజు వ్యవధిలో ఒకటి నుంచి నాలుగు డిగ్రీల మేర తగ్గాయి. మెదక్‌లో అత్యధికంగా 42 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో ఆదివారం రాత్రి పది గంటల వరకు 50కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మాగనూరులో అత్యధికంగా 6.48 సెంటీమీటర్ల భారీ వర్షం పడింది.


శాంతి చర్చల కమిటీతో మాట్లాడుతున్న సిఎం రేవంత్

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపేలా చొరవ తీసుకోండి

- సిఎం శాంతి చర్చల కమిటీ నేతల వినతి
- సానుకూలంగా స్పందించిన రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని శాంతి చర్చల కమిటీ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల సిఎం నివాసంలో ఆయన్ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. "నక్సలిజాన్ని మా ప్రభుత్వం శాంతి భద్రతల అంశంగా చూడటం లేదు. సామాజిక కోణంలో మాత్రమే చూస్తోంది. గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉంది. ఈ అంశంపై సీనియర్ నేతలు, మంత్రులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాం" అని వారికి సీఎం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో శాంతి చర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గాప్రసాద్, జంపన్న, రవి చందర్ తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చావ రవి

ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లాలోని లయన్స్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) జిల్లా అధ్యక్షులు ఎ.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా ఉద్యమ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నుంచి ఈ-కుబేర్‌లో పెండింగ్ ఉన్న జీపీఎఫ్ రుణాలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్స్, పెన్షన్ బకాయిలు అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు ప్రకటించాలని అన్నారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకొని ఫిట్మెంట్ 30శాతం తగ్గకుండా అమలు చేయాలని తెలిపారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల ప్రమోషన్స్, బదిలీలు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేయొద్దని, ప్రీ ప్రైమరీ తరగతులను అంగన్వాడీల్లో కలపకుండా ప్రాథమిక పాఠశాలల్లో ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాలు, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయ, అధ్యాపకులకు జీరో వన్, జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, గురుకుల పాఠశాలల అసంబద్ధమైన పనివేళలను మార్చాలన్నారు. ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, కెజిబివి ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ చెల్లించాలని, అన్ని రకాల సెలవులు వర్తింపచేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్. మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే యాకూబ్, ఉపాధ్యక్షులు ఎన్ స్వప్న, ఎన్ వెంకటేశ్వర్లు, కోశాధికారి కె నాగమల్లయ్య, కార్యదర్శులు డి రమేష్, జి భద్రు నాయక్, జి. వివేక్, పి మంజుల, డి హుస్సేన్, ఇ నర్సింహారావు, ఇ రమేష్, బి హరినాయక్, మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం మరిన్ని భూ పోరాటాలు

- 449 సర్వే నెంబర్‌లో సాగులో ఉన్న పేదలకు పట్టాదారు పాస్ పుస్తకాలివ్వాలి : బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల కోసం మరిన్ని భూ పోరాటాలు చేద్దామని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా మరికల్‌లోని సూర్యచంద్ర ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం రెండవ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల భూములను బలవంతంగా లాక్కొని బడా కార్పొరేట్లకు అప్పజెప్తున్నాయని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ. రెండు లక్షల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ.86 వేలకోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. ప్రతేడాది ఇలా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం బీజేపీ చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ భూములు భూ భారతిలో మరికల్ గ్రామంలోని ప్రభుత్వ భూమి 449 సర్వేనెంబర్‌లో సాగు చేస్తున్న పేదలకు భూ భారతిలో ఎంట్రీ చేసి పట్టాలిచ్చి ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు.. సంఘం అధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలు, అనుభవాలను వివరించారు. భవిష్యత్ కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో వ్యకాస జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలప్ప, గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్, మరికల్ భూ పోరాట కమిటీ నాయకులు ఆర్. బీమ్ రాజు, బి. మల్లయ్య, జి. గోవర్ధన్, జి. సుదర్శన్, జి. వెంకటేష్, లక్ష్మమ్మ, రాములు, లక్ష్మయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నూతన సిఎస్‌గా రామకృష్ణారావు

- ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా కె రామకృష్ణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత సిఎస్ శాంతి కుమారి ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆమె స్థానంలో ఆర్థిక శాఖ స్పెషల్ సిఎస్‌గా ఉన్న రామకృష్ణరావును కొత్త సిఎస్‌గా సర్కార్ నియమించింది. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఆయన ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వచ్చే ఆగస్టు వరకు ఆయన పదవి కాలం ముగియనుంది. ప్రస్తుతమున్న ఐఎఎస్‌ల్లో శశాంక్ గోయల్ తరువాత రాష్ట్ర సీనియర్‌గా ఉన్నారు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడం, కేంద్ర నుంచి నిధులు రాబట్టడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఇతర అవసరాల నేపథ్యంలో ఆయన్ని ప్రభుత్వం సీఎస్‌గా నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆయన పదవి కాలాన్ని రెండేండ్లు పొడిగించే అవకాశముందని భావిస్తున్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సీఎస్‌తో పాటు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా పూర్తి అదనపు భాద్యతలు నిర్వహిస్తారు.

ఆర్థిక నిపుణునిగా సుదీర్ఘ అనుభం..

1991 (ఐఏఎస్) బ్యాచ్‌కు చెందిన రామకృష్ణరావు తెలంగాణ కేడర్‌కు చెందినవారు. ఢిల్లీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజినీరింగ్‌లో గ్రాడ్యుయేట్, మాస్టర్స్ డిగ్రీలను పొందారు. ఇన్వెస్ట్‌మెంట్స్‌లో పట్టా పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నల్లగొండ జాయింట్ కలెక్టర్‌గా, ఆదిలాబాద్, గుంటూరు జిల్లాలకు కలెక్టర్‌గా పనిచేశారు. విద్య శాఖ కమిషనర్‌గా, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదిర్శగా వివిధ హోదాల్లో పని చేశారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్‌గా దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో ఆయనది అందె వేసిన చేయి. తెలంగాణ శాసన సభలో ప్రవేశ పెటిన 14 బడ్జెట్లను తయారు చేయడంలో ముఖ్య భూమిక పోషించారు. దేశంలోని ఏ ఐఏఎస్ అధికారి ఇన్ని సార్లు బడ్జెట్‌ను రూపొందించిన దాఖలాలు లేవని తెలుస్తోంది. ఇందులో 12 పూర్తి స్థాయి బడ్జెట్లు కాగా రెండు ఓటాన్ అకౌంట్ బడ్జెట్లు ఉన్నాయి.

కార్మిక చట్టాల సవరణ సరికాదు

- సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరించి నాలుగు కోడ్లుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. కార్మిక హక్కులను కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున పోరాటం చేసేందుకు కార్మిక లోకం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మే 20న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్, అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు సునీత, సిఐటియు రాష్ట్ర కోశాధికారి అబ్బోజు రమణ, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ అశయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీఐటీయూ మంచిర్యాల జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలపై జాతీయ మహిళ కమిషన్ నేడు బహిరంగ విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్ - మహిళా జన్ సున్వాయి' పేరుతో జాతీయ మహిళా కమిషన్ మహిళల సమస్యలపై వినతులు స్వీకరిస్తుందనీ, ఫిర్యాదులు సమర్పించాలనుకునే మహిళలు తమ వినతులను కమిషన్‌కు సమర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల సమస్యలు, ఫిర్యాదులను నేడు సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు హైదరాబాద్ బేగంపేట్ టూరిజం ప్లాజా, 2వ అంతస్తులోనిసమాగమం హాల్‌లో స్వీకరిస్తారని చెప్పారు. మహిళలు తమ ఫిర్యాదులను, వినతులను నేరుగా జాతీయ మహిళా కమిషన్‌కు సమర్పించవచ్చని వివరించారు.

మంత్రి తుమ్మలతో జార్ఖండ్ మంత్రి శిల్ప నేహా భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో జార్ఖండ్ వ్యవసాయ శాఖ మంత్రి శిల్పినేహా తెర్కే భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం నుంచి రాష్ట్రంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఎన్ఎంఆర్ఐ, ఫిష్ ఫార్మ్, ఎన్ఎఫ్‌డిబి, ఐఐఎంఆర్ సంబంధిత సమావేశాల్లో ఆమె ప్రసంగించనున్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ పాషా తదితరులు కూడా భేటీలో ఉన్నారు.

బిసి కులగణనను స్వాగతిస్తూ తీర్మానం చేయాలి

- టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన బిసి కులగణన బిల్లును స్వాగతిస్తూ తీర్మానాన్ని ఆమోదించాలని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి బిఆర్ఎస్ అధ్యక్ష పదవిలో కేసీఆరే ఉన్నారని విమర్శించారు. ఈసారైనా నాయకత్వ మార్పు చేపట్టి సామాజికన్యాయం పాటించాలని కోరారు. ఏఐసీసీ అధ్యక్ష పదవిలో మల్లిఖార్జున ఖర్గే ఉన్నారనీ, ఆ ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని చెప్పారు. టిపిసిసి అధ్యక్ష పదవిని తమ పార్టీ బీసీ నేతలకు కట్టబెట్టిందని గుర్తు చేశారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి


- జాజుల శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టుల సమస్యను కేంద్ర ప్రభుత్వం శాంతి భద్రతల సమస్యగా కాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యగా చూడాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాల్పులు విరమిస్తే తాము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతి చర్చలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఆలోచించి వారిని చర్చలకు పిలవాలని కోరారు. మరోవైపు మావోయిస్టులు ఆయుధాలను వదిలిపెట్టి ప్రజాస్వామ్యంలోకొచ్చి ప్రజాస్వామ్య బద్ధంగా, రాజ్యాంగానికి లోబడి, ప్రజా సమస్యలపై పోరాడాలని ఆయన సూచించారు.

సంక్రాంతి మధుసూదన్‌రావు కన్నుమూత

- ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరనిలోటు : తమ్మినేని
- కమ్యూనిస్టు శిఖరం నేలకొరిగింది : పోతినేని, నున్నా
- రాజకీయ ఓనమాలు ఆయన వద్దనే నేర్చుకున్నా : కాంగ్రెస్ ఎంపి మల్లు రవి
- సంతాప సభలో పలువురు నివాళి


మధుసూదన్ రావు అంతిమయాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లాలాపురం లాల్ జెండా నిర్మాత, సిపిఎం సీనియర్ నాయకులు సంక్రాంతి మధుసూదన్‌రావు(87) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. మూడు రోజుల క్రితం ఇంట్లో కిందపడి తొంటి విరగడంతో కుటుంబ సభ్యులు, స్థానిక సిపిఎం నాయకులు ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్స చేయించారు. ఆదివారం మధ్యాహ్నం డిచ్చార్జి అవ్వాల్సి ఉండగా ఉదయం ఏడుగంటల సమయంలో గుండెపోటు వచ్చి మరణించారు. మధుసూదన్‌రావు కండ్లను కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు ఖమ్మం నేత్రనిధికి దానం చేశారు. ఆయన భౌతికదేహాన్ని భారీ బైక్ ర్యాలీ నిర్వహించి డప్పు దళంతో ప్రత్యేక వాహనంలో వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించారు. తాను బతికి ఉన్నంతకాలం తన జీవితాన్ని పేద ప్రజల కోసం అంకితం చేశానని, చనిపోయి కూడా మెడికల్ విద్యార్థులకు ఉపయోగపడాలని మధుసూదన్‌రావు తరుచూ కుటుంబ సభ్యులతో చెప్పేవారు. ఆయన కోరిక మేరకు భౌతికదేహాన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌కి కుటుంబ సభ్యులు అప్పగించారు. కాగా, 2015లో పెద్ద ప్రేగుకి క్యాన్సర్ వ్యాధి సోకినా ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా శస్త్రచికిత్స చేయించుకొని జయించారు. ఇంటి వద్దనే ఉంటూ జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, జిల్లా రాజకీయాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నాయకులు ఇంటికి వచ్చిన సమయంలో వారితో చర్చించి పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకునేవారు. మధుసూదన్‌రావుకి భార్య సామ్రాజ్యం, కొడుకు రవికుమార్(లెక్చరర్), కోడలు రాధాకృష్ణ, కుమార్తె నామా సంధ్య, అల్లుడు వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఈ సందర్భంగా పార్టీ టౌన్ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. మంచి కమ్యూనిస్టు అంటే మధుసూదన్‌రావేనని, ఆయన మరణం ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. మధుసూదన్‌రావు జీవితంలో ఎన్నడూ భయపడలేదని, తాను ఖమ్మం డివిజన్ కార్యదర్శిగా ఉన్న సమయంలో కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్న ఆయన ముక్కుసూటిగా ఉన్నది ఉన్నట్టు మాట్లాడేవాడన్నారు. మంచి అధ్యయన శీలి అని, అన్ని విషయాలపై అవగాహన ఉన్న నాయకుడున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఒక పోరాట యోధుడైన కమ్యూనిస్టు శిఖరం నేలకొరిగిందని అన్నారు. తన తుది శ్వాస వరకు ఎర్రజెండాని వీడకుండా తన కుటుంబ సభ్యులను పార్టీలోనే కొనసాగేలా ఎప్పటికప్పుడు దిశ నిర్దేశం చేస్తూ గ్రామంలో పార్టీని కాపాడటంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు.

నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపి మల్లు రవి మాట్లాడుతూ.. మంచి ఆదర్శవంతమైన కమ్యూనిస్టు దిగ్గజాన్ని కోల్పోయామన్నారు. తాను వైరాలో రాజకీయ ఓనమాలు నేర్చుకున్నది మధుసూదన్‌రావు వద్దనేనని తెలిపారు. ప్రజాసమస్యలపై మధుసూదన్‌రావు పీహెచ్‌డీ చేశారని కొనియాడారు. తాను కాంగ్రెస్‌లో ఉన్నా తన భావాలన్నీ ఆయనకి దగ్గరగా ఉండేవన్నారు. డిసిసి జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. మధుసుదన్‌రావు తనకు మేనమామ కావడంతో తనపై, తమ కుటుంబ సభ్యులపై ఆయన ప్రభావం ఎక్కువగా ఉండేదని అన్నారు. వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. నిజాయితీ, నిబద్ధత ఉన్న నిఖార్సయిన గొప్ప మేధావి, ఉత్తమ కమ్యూనిస్టు సంక్రాంతి మధుసూదన్ రావు అని అన్నారు. నివాళ్లర్పించిన వారిలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, రాష్ట్ర గిడ్డంగుల చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు బొర్రా రాజశేఖర్, మల్లెంపాటి వీరభద్రం, కొప్పుల క్రిష్ణయ్య, కె నాగేశ్వరరావు, తాళ్లపల్లి క్రిష్ణ, కుటుంబరావు, అన్నవరపు సత్యనారాయణ, మాజీ మండల కార్యదర్శి సంక్రాంతి సత్యనారాయణ, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు కల్యాణం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు, యూటీఎఫ్ నాయకులు తదితరులు ఉన్నారు.

కొడంగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- కారు, బొలెరో వాహనం ఢీ కొని ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దైవ దర్శనం చేసుకొని తిరిగి తమ ఇంటికి వస్తుండగా కారు, బొలెరో వాహనం ఢీకొని ముగ్గురు మృతిచెందారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ పిఎస్ పరిధిలోని చిట్లపల్లి గేట్ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన రామారావు (51), పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన శ్రీలత(42), ఆమె చిన్న కూతురు శృతి(13)తో కలిసి కారులో కర్నాటకలోని కలబురిగి జిల్లా అఫ్జల్‌పూర తాలూకాలోని దేవల గాణగాపురంలోని ప్రసిద్ధ దత్తాత్రేయ దేవస్థానానికి వెళ్లారు. అక్కడ దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కొడంగల్ శివారులోని చిట్లపల్లి గేటు దగ్గర ఆదివారం మధ్యాహ్నం 163 జాతీయ రహదారిలో వాహనం ఓవర్ టేక్ చేసే సమయంలో వీరి కారు.. ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొన్నాయి. రెండు వాహనాలు నుజ్జునుజ్జు అవ్వగా.. కారులో ఉన్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న సిఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ జివి సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలు కారు ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో నుజ్జునుజ్జైన కారు నుంచి పోలీసులు మృతదేహాలను బయటకు తీసి, కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు, బోలెరో డ్రైవర్ అశోక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఫామ్‌హౌస్‌కే పరిమితమై... రజతోత్సవ సభనా?

- మా ప్రశ్నలకు బదుల్వివండి
- కెసిఆర్‌కు ఎమ్మెల్సీ వెంకట్ సూటి ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్ష నేతగా ఉండి 15 నెలలుగా ప్రజల్లోకి వెళ్లకుండా, చట్టసభలకు పోకుండా ఫామ్‌హౌస్‌కు పరిమితమై 25 యేళ్ల బిఆర్ఎస్ రజతోత్సవ పండగ చేసుకుంటారా? అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. ఈ అంశంపై ముందుగా తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ సమాజం పోరాటం చేసిందో, వాటిని పదేండ్లలో ఎందుకు పట్టించుకోలేదో ప్రజలకు చెప్పాలని కోరారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మాజీ సిఎం కెసిఆర్‌ను ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగమని వాగ్ధానం చేసి ఊరికో ఉద్యోగమైన ఇచ్చారా? ప్రత్యేక రాష్ట్ర పోరాటానికి యుద్ధభూములుగా నిలిచిన యూనివర్సిటీల్లో ఎన్ని ఖాళీలు భర్తీ చేశారని నిలదీశారు. బిసిల రిజర్వేషన్లు పెంచకుండా సబ్బండ వర్గాలను ఎందుకు మోసం చేశారో చెప్పాలని కోరారు. ఎస్‌సి వర్గీకరణ చేయలేకపోయినందుకు రజతోత్సవ సభ జరుపుతున్నారా? అని ఎద్దేవా చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇల్లు పీకి పందిరేసినందుకా? కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టి, ప్రజల నెత్తిన అప్పుల భారం మోపినందుకా? తెలంగాణాను అప్పుల తెలంగాణగా మార్చినందుకా? ఈసభ అని విమర్శించారు.

పెరిగిన సిమెంట్ ధరలు

- 2 నుంచి 4 శాతం పెరుగుదల
- ఇప్పటికే పట్టణాల్లో పడిపోయిన నిర్మాణ రంగం
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సబ్సిడీ ఇవ్వాలన్న డిమాండ్
- అల్ట్రాటెక్ బస్తా ధర రూ.380.. ప్రియా రూ.330



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సి'మంట'తో నిర్మాణ రంగం కుదలయ్యే అవకాశముందని రియల్టర్లు అంటున్నారు. గతేడాది నిర్మాణ రంగం పెద్దగా పుంజుకోలేదు. ఈ ఆర్థిక సంవత్సరమైనా కాస్త ముందడుగేస్తుందని భావించిన వేళ సిమెంట్ ధరల పెరగనున్నాయి. ఇప్పటికే మార్కెట్‌లో బస్తాపై భారీగా ధర పెంచి అమ్ముతుండటంతో ఇళ్ల నిర్మాణాలు కుంటుపడే అవకాశముందంటున్నారు. పట్టణాల్లో కుదేలైన నిర్మాణ రంగం మరింత మందగించడం తప్ప పుంజుకునే అవకాశాలుండనే చర్చ కూడా ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంపై సిమెంట్ ధరలు ప్రభావం పడటం వల్ల ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్దిదారులైన పేదలపై నిర్మాణ వ్యయం పెరిగే ప్రమాదముంది.

2025-26 ఆర్థిక సంత్సరంలో దేశీయ మార్కెట్‌లో సిమెంట్ ధరలు 2-4 శాతం వరకు పెరగనున్నాయి. ఈ ప్రభావంతో బస్తాపై రూ.15 నుంచి 20 వరకు పెరిగే ఛాన్స్ ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. కానీ.. రిటైల్ మార్కెట్‌లో మాత్రం బస్తాపై రూ.60 వరకు పెంచుతారనంటున్నారు. ఈ ఆర్థిక సంత్సరంలో సిమెంట్ డిమాండ్ 6.5 శాతం నుంచి 7.5 శాతం వరకు పెరిగే అవకాశముందని అంచనా వేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సిమెంట్ ఇండస్ట్రీ వృద్ధిరేటు 4.5 నుంచి 5.5 శాతం మాత్రమే ఉంది. కానీ.. ఈ సంవత్సరంలో రోడ్ల నిర్మాణం, రైల్వేలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ మౌలిక సదుపాయాల కల్పన పెరిగే అవకాశముంటుందని అంచనా వేస్తున్నారు. దాంతో సిమెంట్ వినియోగం కూడా పెరిగే అవకాశముందంటున్నారు. వాస్తవ పరిస్థితి మాత్రం ధరల పెరుగుదల వల్ల అభివృద్ధి, గృహ నిర్మాణం పనులు కుంటుపడతాయంటున్నారు.

సిమెంట్ బస్తా ధర రూ.380పైనే

తాజా మార్కెట్ ధరల్ని పరిశీలిస్తే... వివిధ సిమెంట్ కంపెనీలకు చెందిన బస్తా ధర సగటున రూ.380 వరకు పలుకుతుంది. నిర్మాణ రంగంలో పటిష్టత కోసం పిల్లర్స్, స్లాబ్, బేస్‌మెంట్ కాంక్రీట్ పనులకు ఉపయోగించే అల్ట్రాటెక్ సిమెంట్ బస్తా ధర పది రోజుల క్రితం రూ.330 వరకు ఉంది. ప్రస్తుతం ధర రూ.380 నుంచి 390 వరకు ధర పలుకుతుంది. గోడలు, ఇతర కట్టడాలకు ఉపయోగించే కంపెనీల సిమెంట్ బస్తా ధర రూ.320 నుంచి రూ.330 వరకు ఉంది. వీటి ధరలు కూడా పది రోజుల క్రితం రూ.260 వరకు ఉండేది. మార్కెట్‌లో అల్ట్రాటెక్, అంబుజా, దాల్మియా భారతి, ఓరియంట్, సాగర్, రామ్‌కో, చెట్టినాడు, ఎన్‌సీఎల్, శ్రీ సిమెంట్, నాగార్జున, ప్రియా, మహా, ఎసీసీ వంటి కంపెనీలకు చెందిన సిమెంట్ ధరలు మార్కెట్‌లో మండిపోతుండటంతో ఇళ్ల నిర్మాణ ఖర్చులు పెరుగుతున్నాయని వినియోగదారులు బాధపడుతున్నారు.

నిర్మాణ రంగంలపై ధరల ప్రభావం

సిమెంట్ ధరల పెరుగుదల వల్ల నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం పడనుంది. ఇండ్లు, అపార్ట్‌మెంట్స్ నిర్మాణాలతో పాటు పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి పనులు ఊపందుకోవాల్సిన అవసరముంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి పనుల్లో సిమెంట్ వినియోగం ఎంతో కీలకమైంది. తాజాగా పెరిగిన ధరల ప్రభావం వల్ల అన్ని రకాల నిర్మాణ పనులు మందగించే అవకాశముందంటున్నారు. హైదరాబాద్ ప్రాంతానికి సమీపంలో ఉన్న పటాన్‌చెరు, సంగారెడ్డి, తెల్లాపూర్, ఇస్నాపూర్ మొదలు జహీరాబాద్ నుంచి బీదర్ నిర్మాణ రంగం పుంజుకుంటున్న వేళ.. సిమెంట్ ధరలు పెరగడంతో నిర్మాణం జరిగినా వాటి కొనుగోళ్లు మందగిస్తాయని రియల్‌ఎస్టేట్ రంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా త్రిపుల్ ఆర్ నిర్మాణం పుంజుకుంటే సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, షాద్‌నగర్, చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో భారీ ఎత్తున వాణిజ్య, నివాసాలకు సంబంధించిన నిర్మాణాలు వస్తాయని బావిస్తున్న వేళ సిమెంట్, ఐరన్ ధరలు పెరగడం వల్ల నిర్మాణ సంస్థలు వెనకడుగేస్తాయని చెబుతున్నారు. మరో పక్క ఐరన్ ధరలు టన్నుకు ఆరేడు వేల వరకు పెరిగింది.

పెరగనున్న ఇందిరమ్మ ఇండ్లు, అభివృద్ధి పనుల నిర్మాణ వ్యయం

సిమెంట్‌తో పాటు ఐరన్ ధరలు కూడా పెరిగాయి. ఇప్పటికే పలు చోట్ల రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ మండలాలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్ని చేపట్టింది. వాటి నిర్మాణం పూర్తయ్యాక అన్ని గ్రామాల్లోనూ ఎంపిక చేసిన లబ్దిదారులు ఇళ్లను నిర్మించుకునేలా చర్యలు చేపడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ ఆర్థిక సంత్సరంలో 40 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మాత్రమే చెల్లిస్తామని చెప్పింది. ఇంటి నిర్మాణ పనుల్ని మూడు దశల్లో పరిశీలించి పేమెంట్ చేస్తామని చెప్పారు. లబ్దిదారులే ఇంటిని నిర్మాణం చేసుకోవాలి. సిమెంట్ బస్తాపై రూ.60 పైన, ఐరన్ టన్ను ధర రూ.52 వేల నుంచి రూ.60 వేలకు పెరిగినందున పేదలపై నిర్మాణ భారం పడనుంది. అందుకే ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను ప్రభుత్వం సబ్సిడీపై సరఫరా చేయాలని లబ్దిదారులు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సబ్సిడీ ధరలపై హౌసింగ్ శాఖ ద్వారా సిమెంట్‌ను అందజేసింది. ఇప్పుడు కూడా ధరలు పెరిగినందున ప్రభుత్వమే సిమెంట్‌ను ఇవ్వాలని కోరుతున్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సింగూర్ ఎడమ కాల్వకు లైనింగ్, సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకం, గౌరవెల్లి పెండింగ్ పనుల వంటి సాగునీటి ప్రాజెక్టుల్ని చేపట్టాలి. సిమెంట్, ఐరన్ ధరల పెరుగుదల వల్ల కాంట్రాక్టర్లు వెనకడుగేస్తారంటున్నారు.

రాష్ట్రంలో తొలిసారిగా పేగుమార్పిడి చికిత్స

- ఉస్మానియా ఆస్పత్రిలో విజయవంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తొలిసారిగా ఉస్మానియా ఆస్పత్రిలో పేగుమార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. టిపిఎస్ మద్దతుతో చేసిన ఈ చికిత్సను ప్రయివేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటి వరకు నిర్వహించలేదు. షార్ట్ గట్ సింగ్రోమ్, పదేపదే సెంట్రల్ లైన్ ఇన్ఫెక్షన్లు, మేజర్ సెంట్రల్ వెయిన్స్ థ్రాంబోసిస్‌తో బాధపడుతున్న 40 ఏళ్ల వ్యక్తికి ఈ చికిత్సను ఏప్రిల్ 19న నిర్వహించారు. తీవ్రమైన ఎస్ఎంఎ అక్లూజన్ కారణంగా ఆయన భారీ గ్యాంగ్రీన్ కోసం చిన్న పేగు, పెద్ద పేగు విచ్ఛేదనం చేయించుకున్నట్టు ఆస్పత్రి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. అతనిలో డీజే ఫ్లెక్చర్ నుంచి 30 సెంటిమీటర్ల సమీపంలోని బెజునమ్ మాత్రమే మిగిలి ఉందని వివరించారు. ప్రస్తుతం అతను నోటి ద్వారా సాత్వికమైన ఆహారాన్ని తీసుకోగలుగుతున్నారనీ, ఇలియోస్టమీ బాగా పని చేస్తున్నదని డాక్టర్లు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా రజనీకాంత్, నాగరాజు

- 61 మందితో నూతన కమిటీ, 15 మందితో కార్యదర్శివర్గం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ 5వ రాష్ట్ర మహాసభల్లో 61 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా రజనీకాంత్ (కరీంనగర్), ప్రధాన కార్యదర్శిగా టి.నాగరాజు (ఖమ్మం) ఎన్నికయ్యారు. వీరితో కలిపి మొత్తం 15 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా అశోక్, పూజ, కిరణ్ (హైదరాబాద్), శంకర్ (రంగారెడ్డి), శ్రీకాంత్ (కరీంనగర్), శ్రీకాంత్ వర్మ (సూర్యాపేట), ప్రశాంత్ (మహబూబ్‌నగర్), సహాయ కార్యదర్శులుగా యార ప్రశాంత్ (వరంగల్), శంకర్ (నల్లగొండ), రంజిత్ రెడ్డి (సిద్దిపేట), దీపిక, మమత, ఆదిక్ (హైదరాబాద్) ఎన్నికయ్యారు.

ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్‌ను రెన్యువల్ చేయాలి

- తక్షణమే ఉత్తర్వుల్ని జారీ చేయాలి : టిజిఎస్‌జిసిఎఇఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 30 ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న 80 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెన్యూవల్ చేయాలనీ, దానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(టీజీఎస్‌జీసీఓఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆ ఫెడరేషన్ సమావేశం జరిగింది. అందులో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు రావడం లేదని వాపోయారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులకు ఎనిమిది ఏళ్లుగా జీతాలు పెంచకుండా జాప్యం జరుగుతున్న తీరును ఎండగట్టారు. రెవెన్యూ, విద్యా, సంక్షేమ శాఖల్లో ఆరు నెలలకోసారి సర్వీస్ బ్రేక్ చేయడం సరిగాదన్నారు. 12 శాఖల్లో 3,4 నెలల నుంచి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పాలిటెక్నిక్, నాన్ టీచింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయడం లేదనీ, మరోవైపు వారిని తగ్గిస్తున్నారని వాపోయారు. సచివాలయం జీఏడీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు సక్రమంగా చెల్లించాలన్నారు. ట్రెజరీ విభాగంలో 74 మందిని రెన్యూవల్‌ను పెండింగ్‌లో పెట్టడం సరిగాదన్నారు. మీసేవా ఉద్యోగులపై పనిఒత్తిడి పెంచడం, వేధింపులకు గురికావడం సరిగాదన్నారు. 20 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తగ్గించేందుకు శాఖల వారీగా కసరత్తు చేయడాన్ని ప్రభుత్వం ఆపేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైమ్‌స్కేల్, ఎన్ఎంఆర్, డైలీవేజ్, తదితర సిబ్బందిని దశల వారీగా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకూ వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


సీతక్కను సన్మానిస్తున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్

మంత్రి సీతక్కను కలిసిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఆదివారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)ను బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల వారిని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్కతో వారు తొలిసారి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ను, సభ్యులను సీతక్క అభినందించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసి కమిషన్ కి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



బస్సును అడ్డుకుంటున్న గ్రామ ప్రజలు

డంపింగ్ యార్డ్ తొలగించే వరకు పోరాటం

- నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల ప్రజలు
- 82 రోజుకు నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లి ప్యారానగర్ నుంచి బిఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలను తీసుకువెళ్తున్న బస్సులను గ్రామ జెఏసి సభ్యులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జెఏసి సభ్యులు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ హయంలోనే తమ ప్రాంతానికి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదన, స్థల పరిశీలన అన్ని రకాల అనుమతులు ఇచ్చారని విమర్శించారు. ఇప్పుడు ఏమి తెలియనట్టు ప్రస్తుత ప్రభుత్వంపై నెట్టివేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌ను తొలగించేంత వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఈ గ్రామ ప్రజలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారంకి 82 రోజులకు చేరింది. ఇన్ని రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు కనీసం డంపింగ్ యార్డ్‌పై పెదవి విప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంత రైతుల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని వెంటనే డంపింగ్ యార్డ్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. డంపింగ్ యార్డ్ తొలగించేంతవరకు నిరవధిక సమ్మెను నిలిపేదే లేదని గ్రామ ప్రజలు భీష్మించుకుని కూర్చున్నారు.



డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూకు కృతజ్ఞతలు

- తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ హోదాను ఫార్మసీ ఆఫీసర్‌గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ కేంద్ర కమిటీ వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమెను అసోసియేషన్ అధ్యక్షులు బత్తిని సుదర్శన్ గౌడ్ తదితర నాయకులు కలిసి పూలబొకెను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్యారోగ్యశాఖలో ఫార్మసీ యాక్ట్‌ను అమలు చేయాలనీ, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఫార్మసీ యాక్ట్ 1948లోని సెక్షన్ 42ను అమలు చేయాలని కోరారు. బస్తీ దవఖానాల్లో, పల్లె దవాఖానాల్లో ఫార్మసిస్టులను, ప్రతి జిల్లా డివిఎల్ఎంలో ఫార్మసిస్ట్ గ్రేడ్ 1లను , ప్రతి జిల్లా డిఎంహెచ్ఒ, ఫార్మసీ స్టోర్లలో ఫార్మసిస్ట్ గ్రేడ్ 2, గ్రేడ్ 1 పోస్టులను మంజూరు చేయాలనీ, ప్రతి జిల్లా టీచింగ్ ఆస్పత్రుల్లో ఫార్మసిస్ట్ గ్రేడ్ 1 రెండు పోస్టులు, ఫార్మసీ సూపర్ వైజర్లు రెండు పోస్టులు, ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 పన్నెండు పోస్టులు మంజూరు చేయాలన్నారు.

ఫార్మసీ ఆఫీసర్ పోస్టులు అన్ని జిల్లాల టీచింగ్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం 13 సంవత్సరాలు పూర్తి చేసిన ఫార్మసిస్టులకు ఫార్మసీ సూపర్ వైజర్ పోస్టుల్లో నియమించాలని విజ్ఞప్తి చేశారు. క్రిస్టీనాను కలిసిన వారిలో అసోసియేషన్ సెంట్రల్ కమిటీ నాయకులు వేణు గోపాల్ రెడ్డి, కంద కట్ల శరత్ బాబు, జాలిగామ అశోక్, జె.సురేష్ కళ్యాణ్, యాదయ్య, శ్రీధర్ రెడ్డి, రవి కుమార్, అహ్మదూల్లా ఖాన్, ముఖ్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.